క్లుప్తంగా

మితిమీరిన వేగం తీసిందొకరి ప్రాణం

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- మృతుడు ఇంజినీరింగ్ విద్యార్థి

తిరుపతి క్రైమ్: రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి స్థానిక కొర్లకుంట సమీపంలో చోటుచేసుకుంది. ఈస్ట్ పోలీసుల కథనం..లీలా మహల్ సమీపంలోని ఎర్రమిట్ట కాలనీలో నివాసం ఉంటున్న వై.సూర్యకుమార్(23) పుత్తూరు సిద్ధార్థ కాలేజీలో ఇంజినీరింగ్ 4వ సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితులు సంజయ్, సందీప్‌తో కలిసి మోటార్ సైకిల్‌పై బయల్దేరాడు. మితిమీరిన వేగంతో వెళ్తూ కొర్లకుంట సమీపంలోని 39వ పిల్లర్‌ను బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైక్ వెనుకవైపు కూర్చున సందీప్ ఎగిరిపడి పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మరణించాడు. తక్కిన ఇద్దరూ తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. సూర్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కాలేజీకి తరలించారు. మృతుడి స్నేహితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని సోమవారం ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎన్ మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్సీపురం పీఎస్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న చంద్రగిరి డీఎస్పీ

రామచంద్రాపురం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుకను అక్రమంగా వాహనాల్లో తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ రామాంజనేయులు, ఏఎస్ఐ శేఖర్, హెడ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

10న సామూహిక కోలాటం



కోలాటం ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

తిరుపతి కల్చరల్ : వండర్ బుక్ ఆఫ్ రికార్డు సాధించేందుకు నవంబర్ 10న ఎస్వీయూలోని శ్రీజ్ఞానప్రథ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో సామూహిక కోలాట నృత్యం చేపట్టనున్నారు. ఆదివారం వీక్ష స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య డ్యాన్స్ అకాడమీ నిర్వాహకుడు డాక్టర్ శ్రీరామ్‌బాబు పర్యవేక్షణలో బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే కీర్తనకు 2024 మందితో కోలాటం ప్రదర్శన ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగల 6 నుంచి 60 ఏళ్ల వయస్కులు పాల్గొనవచ్చని, వివరాలకు 9603050414 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

దాతకు సత్కారం



సూర్యబాబును సత్కరిస్తున్న దృశ్యం

తిరుపతి కల్చరల్: పక్షపాతంతో బాధపడుతున్న మునిరామయ్య (60)కు ఏడాది పాటు అవసరమయ్యే మందుల నిమిత్తం రూ.40 వేలు సాయం చేసి ఆదుకున్న సూర్యబాబు నాయుడిని తిరుపతి మానవతా శాఖా సభ్యులు ఆదివారం సత్కరించి అభినందించారు. అతడి సేవాదృక్పథాన్ని కొనియాడారు. మానవతా శాఖ చైర్మన్ భార్గవ, కోచైర్మన్ రాళ్లపల్లి మాధవ నాయుడు, అధ్యక్షుడు సీవీ రమణ, కార్యదర్శి సుకుమార్‌రాజు, మునిదామోదరం, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆయుధపూజ



విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో పూజ చేస్తున్న ఈఈ వాసు రెడ్డి, ఏడీఈ శేషాద్రి రెడ్డి

చంద్రగిరి: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక చంద్రగిరి విద్యుత్ సబ్‌స్టేషన్, పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. కార్యాలయాల్లోని పరికరాలు, యంత్రాలను, వాహనాలను శుద్ధి చేశారు. పోలీసు స్టేషన్, విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ ఏటా దీపావళి సందర్భంగా ఆయుధపూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐలు అనిత, రవీంద్ర, విద్యుత్ శాఖ ఈఈ వాసు రెడ్డి, ఏడీఈ శేషాద్రి రెడ్డి, ఈఈలు నాగరాజు, వెంకటరమణ, రజని, ఎర్రమ రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఆన్‌లైన్‌లో క్రాకర్స్..

దీపావళి అదుర్స్

- దీపావళికి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న టపాసులు
- కోరుకున్నవి కొనుగోలు చేసుకోవచ్చు
- అందుబాటులో ఆఫర్లు
- నగదు పంపే విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న నిపుణులు

తిరుపతి గాంధీరోడ్డు : దీపావళి వస్తుందంటే చాలు చిన్నాపెద్ద ఆనందంతో జరుపుకుంటారు. ముఖ్యంగా దివాళి అంటే టపాసులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారు. వాటి కోసం దుకాణాలకు పరుగులు తీస్తారు. అయితే ఇప్పుడు ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి రావడంతో టపాసుల కోసం దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇంట్లో కూర్చునే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోచ్చు. ఆర్డర్ చేసిన 24 గంటల్లోనే మనం కోరుకున్న టపాసులు మన ఇంటికి చేరుతాయి. ఆన్‌లైన్‌పై అవగాహన ఉన్నవారు ఈ తరహా కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. సమ యం ఆదాతో పాటు అనేక రకాల టపాసులను తిరిగి ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉంటుంది.

గిఫ్ట్‌ప్యాక్‌లో..

ఆప్తులు, శ్రేయోభిలాషులకు టపాసుల బాక్స్‌ను కానుకగా పంపాలంటే ఆన్‌లైన్ ద్వారానే సాధ్యమవుతుంది.రూ.500 నుంచి రూ.5 వేలు పైబడి గిఫ్ట్‌ప్యాక్‌లు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్ జంట నగరాల్లో 12 లేదా 24 గంటల్లోనే సరఫరా చేస్తున్నారు. అయితే రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో కూడా 48 గంటల్లో డెలివరీ చేస్తున్నారు. ప్రముఖ కంపెనీలు సైతం టపాసులను ఆన్‌లైన్‌లో సరఫరా చేస్తున్నాయి.

ముందుగా వచ్చిన ఆర్డర్లకు ఆఫర్లు..

దీపావళి దగ్గర పడుతుండడంతో ఆన్‌లైన్‌లో వ్యాపారులు ఆఫర్లు ప్రకటిస్తూ వినియోగదారులను ఆకట్టుకుంటున్నారు. పలువురు రాయితీలు ప్రకటిస్తుండగా మరికొందరు ఆఫర్ కింద టపాసులు అదనంగా ఇస్తున్నారు. టపాసులే కాకుండా దివాళి గిఫ్ట్, స్వీట్‌ప్యాక్‌లను రాయితీ ధరలకు వినియోగదారులకు అందజేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో కొంటున్నారా? అయితే జాగ్రత్త..

దీపావళి సమయంలో మాత్రమే ఆన్‌లైన్‌లో టపాసుల విక్రయం ఉంటుంది. అయితే ఆర్డర్ ఇచ్చే ముందు పలు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. కొందరు ఆన్‌లైన్‌లో ప్రకటనలు ఇచ్చి ఆకట్టుకుంటున్నారు. మరికొందరు బ్లాగ్ స్పాట్‌లు ఏర్పరచుకుని ఆఫర్లు కోరుతారు. ఇలాంటి సమయంలో ఆచితూచి వ్యవహరించాలి. ముఖ్యంగా అప్పటికప్పుడు పుట్టుకువచ్చే ఆన్‌లైన్ స్టోర్లలో కార్డు ఉపయోగించడం, నెట్‌బ్యాంకింగ్ ద్వారా డబ్బులు చెల్లించడం అంతమంచిది కాదు. ఆన్‌లైన్ కొనుగోలు సమయంలో స్క్రీన్‌పై ఉన్న వర్చువల్ కీబోర్డును ఉపయోగిస్తే కొంతవరకు సేఫ్. ఇలాంటి సమయంలో క్యాష్ డెలివరీ వైపు మొగ్గు చూపాలి.

చాలా సులభం..



ఒకప్పుడు అంగడికి వెళ్లి టపాసులు కొనేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. చాలా సులభంగా ఆర్డర్ చేస్తే టపాసులు ఇంటికి వస్తున్నాయి. మా కోడలు కడప దగ్గర మైదుకూరులో ఉంది. తన కోసం ఆన్‌లైన్‌లో టపాసులు బుక్ చేశాను. పండుగ లోపల తనకు అవి చేరుతాయి. ఈ పద్ధతి చాలా బాగుంది. – **వాణి, తిరుపతి**

జైపూర్ నుంచి ఆన్‌లైన్‌లో..



రాజస్థాన్‌లో ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నా. పండుగకు సెలవు లేదు. సరదాగా నెట్ చూస్తుంటే ప్రముఖ సైట్‌లు కనిపించాయి. అందులో చూసి జైపూరు నుంచి ఆన్‌లైన్‌లో టపాసులు బుక్ చేశాను. తీరా బుక్ చేశాక నాకు సెలవు మంజూరైంది. దీపావళి నాకు ముందే వచ్చింది అనుకున్నా. – **వెంకటేష్‌రెడ్డి, తిరుపతి**

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కళాకారులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: టీటీడీ సౌజన్యంతో శ్రీవేంకటేశ్వర నాట్య మయూరి అవార్డ్స్ సంస్థ వారి ఆధ్వర్యంలో ఆదివారం మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరింపజేశాయి. నృత్య సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించిన అనంతరం శ్రీవేంకటేశ్వర నాట్య మయూరి అవార్డ్స్ సంస్థ అధినేత కోటి మాట్లాడుతూ గత పదేళ్లుగా వేలాదిమంది కళాకారులను వివిధ రకాల వేదికలపై ఒక్కటి చేసి, శాస్త్రీయ పద్ధతిలో సనాతనమైన ధర్మాన్ని కాపాడాలని ఉద్దేశంతో కళాకారులచే అనేక సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం కూడా తమ లాంటి సంస్థలను ఆదరిస్తే మరిన్ని మంచి కార్యక్రమాలు చేపడుతూ కళాకారులను మరింత చేయూతనిస్తూ ప్రోత్సహిస్తూ నృత్య కళావికాసానికి కృషి చేస్తామని తెలిపారు. ధార్మిక సంస్థ అయిన టీటీడీ సైతం ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలకు సహకారం అందించి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి వందలాది మంది ప్రతిభా కళాకారులు శ్రీవేంకటేశ్వరస్వామి, అన్నమాచార్య భక్తి పాటలకు అద్భుత రీతిలో భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన చేస్తూ ఆకట్టుకున్నారు. అనంతరం టీటీడీ విద్యా సంస్థల తైక్వాండో శిక్షకుడు గోపినాయుడు చేతుల మీదుగా 200 మంది కళాకారులను జ్ఞాపికల, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించి వారికి లక్ష్మీ తులసి మొక్కలను బహూకరించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు కామెడీ శాస్త్రి, కేశవ, వినుకొండ రవి, హరి, సిల్వర్ బెల్స్ ఇంగ్లిషు మీడియం స్కూల్ కరస్పాండెంట్ ఎంఎ కుమార్, కళాకారులు పాల్గొన్నారు.

స్టార్ కృష్ణపై చర్యలు తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు హేమావతి

తిరుపతి కల్చరల్: మహిళలను చులకనగా మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడిన స్టార్ కృష్ణ అలియాస్ కాకి కృష్ణయ్యపై చర్యలు తీసుకోవాలని వడమాలపేట మండలం ఎస్వీ పురానికి చెందిన దళిత మహిళలు హేమావతి, ఉమాదేవి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తాము ఒక సమస్యపై ఏర్పేడు పోలీస్ స్టేషన్‌కు వెళ్తే, అక్కడ ఓ రైతు తాను కొనుగోలు చేసిన భూమిలో అధికారులు రోడ్డు చూపకపోవడంతో నష్టపోయానని, అందుకు డబ్బులు ఇవ్వాలని కృష్ణయ్య వేధించాడన్నారు. ఇవ్వకపోతే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని రైతును బెదిరించాడన్నారు. ఆ సమయంలో తాము అక్కడే ఉండగా ఆ రైతు జరిగిన విషయాన్ని తమకు చెప్పి వాపోయాడని తెలిపారు. తప్పుడు పనులు చేయవద్దని చెప్పిన తమపై కృష్ణయ్య జనం మధ్యలో ఇష్టారాజ్యంగా దుర్భాషలాడారని వాపోయారు. ఆర్టీసీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న అతడు దళిత నాయకుడనని చెప్పుకుంటూ అనేక దందాలకు పాల్పడుతూ అధిక మొత్తంలో ఆస్తులు సంపాదించారని ఆరోపించారు. 'కేవలం ఆర్టీసీ డ్రైవర్ భార్య అయిన నువ్వు.. నన్ను ఎదిరిస్తావా..? నీ భర్తను ఉద్యోగం నుంచి తొలగిస్తా' అని తనను బెదిరించాడని వాపోయారు. కులం కార్డు అడ్డు పెట్టుకుని దందాలు చేస్తున్నాడని, తప్పు చేస్తున్నావు మంచిది కాదని చెప్పినందుకు నోటితో చెప్పలేని విధంగా దుర్భాషలాడుతూ మహిళలని కూడా చూడకుండా తమపై దౌర్జన్యం చేసి బెదిరించాడని, తక్షణం అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో దళిత మహిళలు ఎ.మణమ్మ, కె.మంజుల, సి.నాగేశ్వరి, ముని వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గానికి అభినందనలు



ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న భూమన

తిరుపతి మంగళం : ఇటీవల జరిగిన ప్రెస్‌క్లబ్ ఎన్నికలలో గెలుపొందిన నూతన కార్యవర్గాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, చిత్తూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. తిరుపతి పద్మావతిపురంలోని తన నివాసంలో ఆదివారం ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షుడు మురళితో పాటు జాయింట్ సెక్రటరీలు విజయ్‌యాదవ్, జగదీష్, కార్యవర్గ సభ్యుడు నాగార్జునను ఈ సందర్భంగా భూమన దుశ్శాలువలతో సత్కరించారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

పాకాల : రాష్ట్రప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని బీటీఏ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాల ఆవరణలో మండల అధ్యక్షుడు జ్యోతిప్రసాద్ అధ్యక్షతన బీటీఏ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా అధ్యక్షుడు రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి, జాతీయ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ 2023 జూలై నుంచి 12వ పీఆర్సీ అమలు కావలసి ఉందని, 15 నెలలు గడుస్తున్నా పీఆర్సీ కమిటీ కూడా నియమించలేదని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఐఆర్ 30 శాతాన్ని ప్రకటించాలని కోరారు. గత ప్రభుత్వంలో రావలసిన డీఏ, పీఆర్సీ అరియర్స్ బకాయిలను దశల వారీగా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు గురుస్వామికి డాక్టరేట్



టీచర్ గురుస్వామికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్సిటీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: బైరాగిపట్టెడలో ఎంజీఎం హైస్కూల్లో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఒకవైపు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ మరోవైపు రంగస్థల ప్రదర్శనలు ఇస్తూ బృందాలుగా గ్రామాల్లో జానపద పాటలు పాడడంతో సమాజంలోని రుగ్మతల నిర్మూలనకు ఆయన చేస్తున్న కృషిని గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈయన ఇప్పటికే 1100 రంగస్థల పద్యాలను, 110 సినీ గేయాలను, 101 భగవద్గీత శ్లోకాలతో పాటు జానపద గీతాలను పరిశీలించారు. దీనితో పాటు తెలుగు లిటరేచర్, సామాజిక సేవ, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు గాయకుడు, నటుడిగా రాణిస్తున్న గురుస్వామికి ఈనెల 26న తమిళనాడు హోసూరులోని ఓ ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్వాహకులు ఆయనకు గౌరవ డాక్టరేట్ అందజేసి ఘనంగా సత్కరించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



కూచిపూడి నాట్యంతో అలరిస్తున్న కళాకారులు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. తిరుపతికి చెందిన శ్రీరాధిక కూచిపూడి నృత్యాలయం నాట్య గురువు రాధిక అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో భాగంగా మూషిక వాహన, అష్టలక్ష్మి, శ్రీనివాస కల్యాణం, గరుడ గమన, నవదుర్గ, ముద్దుగారే యశోద, చేరియశోదకు, స్వాగతం కృష్ణ, భావములోన, భో శంభో వంటి పాటలకు కళాకారులు పావని, తేజస్విని, గీతిక, జితేష, శివనందిని, జశ్విత, రాజేశ్వరి, చరిష్మ, కోమలశ్రీ, రిత్విక, లాస్యప్రియ, సాయిగీత, తేజన్య, రాజేశ్వరి, షణ్ముకప్రియ తమ నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

- పోలీసుల దాడులను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు



మీడియాతో మాట్లాడుతున్న నాగరాజు

తిరుపతి సిటీ: ఎస్వీయూ తారకరామా స్టేడియంలో కార్తీక్ మ్యూజిక్ షోకు హాజరైన యూనివర్సిటీ విద్యార్థులపై అకారణంగా దాడి చేసిన కానిస్టేబుల్ రవి నాయక్‌తో పాటు మరో ముగ్గురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలని సీపీఎం పార్టీ తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్టేడియంలో కార్యక్రమాన్ని తిలకిస్తున్న నరేంద్ర, వీరేష్ అనే విద్యార్థులను పోలీసులు విచక్షణా రహితంగా కొట్టి గాయపరచడం దారుణమన్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. అసాంఘిక శక్తులను నిలువరించలేని పోలీసులు ఒక బాధ్యత కలిగిన ఓ విద్యార్థి సంఘంలో నాయకులని తెలిసి ఇలాంటి దాడులకు పాల్పడడం సమంజసం కాదన్నారు. మద్యం షాపులను విద్యాసంస్థల సమీపంలో ఏర్పాటు చేయవద్దని చేపట్టే నిరసనల్లో ఈ విద్యార్థులు భాగస్వాములు అవుతున్నారనే అక్కసుతో పోలీసులు ఇలా దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. గాయపడిన విద్యార్థులను రుయా ఆస్పత్రిలో ఎస్ఎఫ్ఐ నాయకులు చేర్పించారన్నారు. పోలీసు దౌర్జన్యకాండను రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజాస్వామికవాదులు ఖండించాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఎస్పీ చర్యలు తీసుకోవాలన్నారు.



డీఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

'ఆ పోలీసులను సస్పెండ్ చేయాలి'

ఎస్వీయూ ఎన్టీఆర్ స్టేడియంలో వర్సిటీ విద్యార్థులపై అకారణంగా దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు ఈస్ట్ పోలీస్‌స్టేషన్ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం రాత్రి యూనివర్సిటీ విద్యార్థులు నరేంద్ర, వీరేష్ స్టేడియంలో ఉండగా స్పెషల్ పార్టీ పోలీసులు అసభ్య పదజాలంతో దూషించారన్నారు. తాము వర్సిటీ విద్యార్థులమని చెబుతున్నా రవిబాబు నాయక్ అనే కానిస్టేబుల్ దుర్భాషలాడుతూ ఎస్పీ కూడా నన్ను ఏమి చేయలేడు అంటూ క్యాంపస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఆరుగురు పోలీసులతో కలిసి చితకబాది ఫోన్లు లాక్కుని స్టేషన్ బయటకు తరిమేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అక్బర్, రవి, వర్సిటీ ఎస్ఎఫ్ఐ కమిటీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూకు రాజభాష నాయక్ పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న చారుకేష్

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ (ఎన్ఎస్‌యూ) రాజభాష నాయక్ పురస్కారం లభించింది. అండమాన్ నికోబార్‌లోని పోర్ట్ బ్లేయర్‌లో ఆదివారం జరిగిన 43వ అఖిల భారతీయ రాజభాష శిక్షణ శిబిరం, సమ్మేళనంలో ఈ పురస్కారాన్ని ప్రకటించారు. వర్సిటీలోని రాజభాష సెల్ ఆధ్వర్యంలో హిందీభాషా ప్రచార ప్రసారం, వికాసం కోసం చేసిన విశేషకృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కించుకుంది. రాజభాషా సెల్ సభ్యులు డాక్టర్ చారుకేష్ పోర్ట్ బ్లేయర్‌లో జరిగిన సమావేశంలో పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి హర్షాన్ని వ్యక్తం చేస్తూ, విశేషకృషి చేసిన రాజభాష సమితి సభ్యులను ఆయన అభినందించారు.

శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలి

తిరుపతి(అలిపిరి): విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలని.. బాల్యం నుంచే అన్ని రంగాల్లోనూ రాణించాలని సైన్సు సెంటర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ అన్నారు. ఆదివారం తిరుపతిలోని ప్రాంతీయ విజ్ఞానకేంద్రంలో తిరుపతి జిల్లా చెకుముకి సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా 60 పాఠశాలల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. చెకుముకి జిల్లాస్థాయి పరీక్ష నిర్వహించిన అనంతరం సైన్సు సెంటర్ సందర్శన, ప్లానిటోరియం, సైన్స్ మ్యాజిక్ షోలను ఉత్సాహంగా తిలకించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు, సైన్స్ పుస్తకాలు అందించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు నవంబర్ 9, 10 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి బాలాజీ, ఫిజికల్ సైన్స్ ఫోరం మేఘనాథ్, రోటరీక్లబ్ రవి కుమార్, తిరుపతి బాలోత్సవం దామోదరం, సైన్స్ సెంటర్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ



దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

తిరుపతి మంగళం : తిరుపతి నగర పరిధిలోని జీవకోన జీవలింగేశ్వర స్వామి ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి 20వ వార్షిక మహాభారత మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం నిర్వహించిన దుర్యోధన వధ ఘట్టం ఆహుతులను ఆకట్టుకుంది. సాయంత్రం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాన్ని చేపట్టారు. రాత్రి వెంకట నటరాజ నాటక మండలి తిరుపతి వారిచే శ్రీ రామాంజనేయ యుద్ధం (పద్య నాటకం)ప్రదర్శించారు. ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించి, గ్రామీణ ఆచారాలను ప్రజల ముందు ఉంచిన ధర్మరాజుల ఆలయ నిర్వాహకులు అన్నా రామకృష్ణ, అన్నా మల్లీశ్వరిని స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాటం



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి

తిరుపతి కల్చరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు వ్యతిరేకిస్తూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి పిలుపునిచ్చారు. ఆదివారం గంధమనేని శివయ్య భవన్‌లో ఏఐఎస్ఎఫ్ తిరుపతి నగర 17వ మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లా డారు. జాతీయ నూతన విద్యావిధానం కారణంగా రాష్ట్రంలో చాలా విద్యాసంస్థలు మూతపడ్డాయని తక్షణమే ఆ విద్యావిధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నం భోజన పథకం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్‌కుమార్, రాష్ట్ర గర్ల్స్ కోకన్వీనర్ ప్రీతి, జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, నగర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుద్ధుని బోధనల సారాంశాన్ని తెలుసుకోవాలి

పాకాల : స్వేచ్ఛ, సమానత్వం సోదర భావం, మనుషుల మధ్య స్నేహభావం రావాలంటే బుద్ధుని బోధనల సారాంశాన్ని ప్రజలు తెలుసుకోవాలని బుద్ధిస్టులు సోమరాజు, నాగరాజు తెలిపారు. ఆదివారం స్థానిక పాకాల శాఖా గ్రంథాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధ్యయనా తరగతులను గ్రంథాలయాధికారి తాళ్ల రవీంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు మాట్లాడుతూ బుద్ధుడి ప్రవచనాలు వినడం వల్ల మనశ్శాంతి దొరుకుతుందని, అందరికీ ఉపయోగకరమన్నారు. భారత రాజ్యాంగంలోకి బౌద్ధ ధర్మాలు ఏవిధంగా తీసుకోబడినవి అనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



సినిమా హీరో కిరణ్ అబ్బవరం

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం సినీ హీరో కిరణ్ అబ్బవరం, సినిమా డైరెక్టర్ అండ్ ప్రొడ్యూసర్ బీవీఎస్ రవి, గోవా పీఠాధిపతి శ్రీమద్ విద్యదేశ్ తీర్థ శ్రీపాద పాండేరా స్వామీజీ, నటుడు రవిప్రకాష్, ఎమ్మెల్సీ మధుసూదన్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.